కట్టపై జీవనం.. సమస్యల సుడిగుండం

ఆరితే వెలగని వీధి దీపాలు, అందరికీ తాగునీరు అందించలేని చేతిపంపు, కనుచూపు మేర కనిపించని మౌలిక సదుపాయాలు, రాత్రయితే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఇలా.. ఎటుచూసినా సమస్యల సుడిగుండం. ఇవీ నరుకూరు కాలువ కట్టపై జీవిస్తున్న గిరిజనుల దుర్భర పరిస్థితి.

- రెండు కాలువల మధ్య నివాసాలు
- భయాందోళన మధ్య జీవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


రెండు కాలువల మధ్య ఉన్న గిరిజన కాలనీ

తోటపల్లిగూడూరు : మండలంలోని నరుకూరు సమీపంలో మాచర్లవారిపాళెం కాలువ, నరుకూరు చెరువు కాలువల మధ్య ఉన్న కట్టపై సుమారు 85 నివాసాల్లో 405 మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఇందులో సగం నివాసాలు నరుకూరు పంచాయితీలో, మిగిలిన సగం గుడిపల్లిపాడు పంచాయతీ కిందకు వస్తాయి. సుమారు 55 ఏళ్లుగా స్థానిక గిరిజనులు ఈ కాలువ గట్టుపై ఏర్పాటు చేసుకున్న పిచ్చుగూళ్లలాంటి పూరిపాకల్లో నివాసం ఉంటున్నారు.

మౌలిక వసతులకు దూరంగా..

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. వారి అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నాం. వారి కోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడం. ఇవీ తరచూ ప్రభుత్వ పాలకుల మాటలు. అయితే గిరిజనుల జీవన స్థితిగతులు వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంటున్నాయి. కాలనీలోని స్థానికులు మౌలిక సదుపాయాలలేమితో ఇబ్బందులు పడడమే కాకుండా చిన్నారులకు సైతం రక్షణ లేకుండా పోయింది. నివాసాలన్నీ రెండు కాలువల మధ్య ఉండడంతో కాలనీలోని చిన్నారులు ఆటలాడుకునే క్రమంలో కాలువల్లో పడి మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. పంచాయతీ వేగంగా అభివృద్ధి చెందుతున్నా పంచాయతీ పరిధిలో గ్రామానికి కాస్త దూరంగా ఉండడంతో ఈ గిరిజనుల బాగోగులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ కట్టకింద గిరిజన కాలనీ వైపు అటు ప్రజా ప్రతినిధులు ఇటు అధికారులు కూడా తొంగి చూడడం లేదు. పగలు ఫర్వాలేదనిపించినా రాత్రిపూట స్థానికులు భయాందోళన మధ్య నివసించాల్సి వస్తోంది. చీకటి పడితే పాములు ఇళ్ల చుట్టూ చక్కర్లు కొడుతుంటాయి. ఈ పాముల బెడదతో సాయంత్రమైతే స్థానికులు ఇళ్లు వదిలి బయటకు రాలేకపోతున్నారు. బయట ప్రాంతంలో ఇళ్ల స్థలాలు చూపించి పక్కా ఇళ్లు కట్టించమని స్థానిక గిరిజనులు కోరుతున్నా పాలకులు పెడచెవిన పెడుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



నరుకూరు కాలువల కట్ట కింద నివసిస్తున్న మేము ఎన్నో ఏళ్లగా మౌలిక వసతులకు నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు కాలనీలో పర్యటించినప్పుడు ఎన్నో చెబుతారు. అయితే తమ సమస్యలను పరిష్కరించడం లేదు. మా కాలనీ వాసులకు మౌలిక సదుపాయాలను కల్పించడమో, మమ్మల్ని మరో ప్రాంతానికి తరలించడమో చేయాలి.

– సుబ్బరామయ్య, స్థానికుడు


కాలువ పక్కనే ఉన్న గుడిసెలు


ప్రమాదకరంగా ఉన్న కాలువ గట్టుపై పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

వెంకయ్యస్వామికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం విశేష పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు ముందుగా వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివాహం, సంతానం కోసం పలువురు హోమ గుండం వేసి పూజ నిర్వహించారు. కార్యక్రమాలకు గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమ ఏర్పాటు చేశారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకిసేవ వైభవంగా జరిగింది.

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న నేతలు

నెల్లూరు(బారకాసు): జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యమని నేతలు పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవ వేడుకలను జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు అన్నదానంతో పాటు వస్త్రాలను అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు దయాశంకర్, కోశాధికారి గద్దం హనోక్, సుందరం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలకు పాల్పడుతుండగా, ఆమెపై పోలీసులు పీడీ యాక్ట్‌ను గతేడాది నమోదు చేసి జైలుకు పంపారు. జైలు నుంచి బయటకొచ్చినా, ఆమె తీరులో మార్పురాలేదు. యథేచ్ఛగా విక్రయాలకు పాల్పడుతుండగా, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు ఆమెను శనివారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో నిందితురాలి వివరాలను ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. కపాడిపాళెంలోని రాయపువీధికి చెందిన ముంతాజ్ విశాఖ, ఏఓబీ ప్రాంతాల నుంచి గంజాయిని దిగుమతి చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా జిల్లా వ్యాప్తంగా విక్రయాలు సాగిస్తున్నారు. సంతపేట, కలువాయి, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్లతో పాటు ఎస్‌ఈబీ నెల్లూరు – 1, ఆత్మకూరు, కోవూరు స్టేషన్లలో ఆమెపై గంజాయి కేసులున్నాయి. పలుమార్లు ఆమెకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించినా ఫలితం లేదు. దీంతో గతేడాది పీడీ యాక్ట్‌ను ప్రయోగించి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. జైలు నుంచి బయటకొచ్చినా తీరులో మార్పురాలేదు. ఈ క్రమంలో స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాల కట్టడికి ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విక్రేతలపై నిఘా ఉంచారు. ముంతాజ్ తన ఇంట్లో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని పక్కా సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి ఆమె ఇంటిపై దాడి చేశారు. అక్కడున్న 16 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితురాలిని అరెస్ట్ చేశారు.

వావిళ్లలో నేత్రదానం


నారాయణమ్మ (ఫైల్)

విడవలూరు : మండలంలోని వావిళ్ల గ్రామంలో మాజీ ఎంపీపీ తుళ్లూరు గోపాలయ్య పిన్నమ్మ నారాయణమ్మ(75) శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో ఆమె స్వగృహంలో మరణించారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆమె నేత్రాలను మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మాదరన్ ఐ ఆస్పత్రి వారికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు, నాగేశ్వరరావు ఆమె నేత్రాలను సేకరించారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం


ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. అయితే అధికారులెవరూ సమావేశానికి రాకపోవడంతో తూతూమంత్రంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు వినయ్ నారాయణ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంత విడుదలయ్యాయో చెప్పాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓను ప్రశ్నించారు. అధికారులు సమావేశానికి హాజరు కాకపోతే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని, ప్రజల సమస్యలను చర్చించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మెళకువలతో కూడిన బోధన అవసరం

- ఎంఈఓ అంకయ్య


మాట్లాడుతున్న ఎంఈఓ అంకయ్య

కొడవలూరు : తెలుగు, ఆంగ్ల సబ్జెక్ట్‌ల్లో మెళకువలతో కూడిన బోధనా పద్ధతులు అవసరమని ఎంఈఓ ఎస్.అంకయ్య సూచించారు. కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు తెలుగు, ఆంగ్ల సబ్జెక్ల బోధనపై శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తేలా, ఎక్కువ కాలం గుర్తుండేలా బోధన సాగాలన్నారు. శిక్షణా తరగతుల్లో ఆధునిక బోధనా పద్ధతులు, మెళకువలపై నిపుణులు శిక్షణ ఇస్తున్నందున దీనిని సద్వినియోగం చేసుకుని అమలు చేయాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో అమలు చేయాల్సిన విద్యా ప్రవేశిక, బడి బయట పిల్లలు బడిలో చేరిక తదితరాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టిసారించాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులకు ఎ.సంధ్య, ఎ.కీర్తన, పి.హరిబాబు రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, టీవీ.సురేష్, శ్రీహరి పాల్గొన్నారు.

బ్రహ్మదేవి భూముల కౌలువేలం వాయిదా


అధికారులతో చర్చిస్తున్న రైతులు

ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి గ్రామంలో ఉన్న శ్రీకైలాసనాథేశ్వరాలయానికి చెందిన భూముల కౌలువేలం పాట వాయిదా పడింది. ఈ ఆలయానికి చెందిన సుమారు 57.34 ఎకరాల మాగాణి భూములకు శనివారం సాగు వేలం వేసేందుకు ఈఓ మోహన్‌కుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో మూడేళ్లకు ఒక సారి వేలం వేసే పద్ధతి ఉండగా, ఇక నుంచి ప్రతి ఏడాది పాట నిర్వహిస్తామని షరతు పెట్టారు. పైగా గతంలో కంటే ఎక్కువ ధరకు వేలం పాడాలని నిబంధన విధించారు. దీనితో రైతులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. గతంలో వేలం పాడి ఈ భూముల్లో సాగు చేయడం వల్ల నష్టం వచ్చిందని, పాత ధరకే వేలం నిర్ణయించాలని రైతులు కోరారు. తక్కువ ధరకు వేలం పాడారు. అయితే, ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడం వల్ల వేలం వాయిదా వేశారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం


చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న అమరేంద్రరెడ్డి

విడవలూరు : ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత చాలా ముఖ్యమని వైద్యాధికారి అమరేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని వావిళ్ల ఎస్టీ కాలనీలో రామతీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం ఎస్టీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలకు వెళ్లి పిల్లలకు వైద్య పరీక్షలు చేపట్టారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రంలోని బాలింతలు, గర్భిణులకు అందించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్‌ఎస్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పశువుల సంతకు రూ.12.10 లక్షలు


వేలం నిర్వహిస్తున్న అధికారులు

మనుబోలు : మనుబోలులో పశువుల సంత నిర్వహణ హక్కులు రూ.12.10 లక్షలు పలికాయి. సంత నిర్వహణ కోసం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కంచి పద్మమ్మ, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ అధ్యక్షతన శనివారం వేలం నిర్వహించారు. మొత్తం ఏడుగురు రూ.10 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సాని వెంకటరమణయ్య గరిష్టంగా రూ.12 లక్షల 10 వేలకు హక్కులు దక్కించుకున్నారు. ఏడాదిపాటు సంత నిర్వహణ హక్కులు దక్కాయి. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెంచుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా నిత్యహోమాలు, గోపురోత్సవం తదితరాలను శనివారం జరిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె సమర్పణ



నెల్లూరు(బృందావనం): మైపాడు రోడ్డులోని వైకుంఠపురంలో గల కాశీనాయన ఆశ్రమంలో కొలువైన దుర్గమ్మకు సారెను భక్తులు సమర్పించారు. అనంతరం పూజలు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు ధన్వి శ్రీనివాస్, మహేష్, మురళి, అనిత, పద్మజ, రజని, మీనా, భార్గవి, మీనాక్షి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలి


వీఎస్‌యూ ఆవరణలో మొక్క నాటుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం : మొక్కలు నాటడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, జనతా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు దాసరి ప్రసాద్, వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ సీఐగా వేణు బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మారుతికృష్ణను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో వేణును సీఐగా నియమించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి



కోవూరు : ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కోవూరు : కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారం జరిపిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కోవూరులో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట చలపతి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అక్కడి ప్రభుత్వాలు న్యాయం చేసేవరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ ర్యాలీలో వైద్యులు సలావుద్దీన్, వంశీ, కిరణ్, భారతి, మాళవిక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. సీహెచ్‌సీ నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ వైద్యాధికారి పద్మజ మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ

పొదలకూరు : పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది శనివారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు అత్యవసర కేసులను మాత్రమే చూశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ అత్యంత దారుణమైన ఘటన కోల్‌కతా ఆస్పత్రిలో జరిగిందన్నారు.


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ర్యాలీలో పాల్గొన్న సీహెచ్‌సీ సిబ్బంది


పొదలకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది